చీర బయటికి తీసి తాంబూలం పూలు పళ్లు పెట్టి చీరని ఆమె కొంగులో పెడుతూ... ఆమెని జాగ్రత్తగా గమనిస్తూ "ఈ కలర్ బాగా ఇష్టమా అక్కయ్యా" అన్నాను కాజువల్‌గా అడిగినట్లు... ఆమె కళ్లల్లో కనిపించిన ఉలికిపాటు నా దృష్టిని దాటి పోలేదు. ఆ చీరని చూస్తూనే సుందరి మొహం నల్లగా మాడిపోయింది.

"ఆ మొహం చూస్తే తెలీట్లేదు సుందరొదినకి చాలా బాగా నచ్చిందని" అంది శాంభవి అదోలా నవ్వుతూ.

అది వాళ్లు బలహీనతో... అలవాటో గానీ కొంత మంది వ్యక్తులు పెళ్లి పేరంటాలకి వెళ్లినపుడు వెండి, బంగారు వస్తువులతో పాటు పట్టుచీరలని తస్కరిస్తుంటారు. దొంగతనాన్ని పట్టుకున్న వాళ్లు డైరెక్ట్‌గా నిలదీస్తే పెళ్లికి పిలిచి దొంగతనం అంటగడతారా అని ఎదురుదాడికి దిగుతారు. అందుకే నేను, శాంభవి 'నొప్పింపక...తానొవ్వక' అన్నట్టు ప్రవర్తించాము. దొంగని ఇండైరెక్ట్‌గా నువు దొంగవి సుమా! అని గుర్తు చేశాము.

మాడిన పెసరట్టులా ఉన్న సుందరి మొహం చూసి నేను, శాంభవి మనసులోనే నవ్వుకున్నాం.

**-కర్లపూడి విజయలక్ష్మి ★**

# చెప్పేటందుకు నీతులు!

రామారావు సిటీబస్సులో ప్రయాణం చేసి ఆదరా బాదరాగా వచ్చి తన సీట్లో అన్నీ సర్దుకుని సెటిల్ అయ్యేసరికి పదకొండయింది. అప్పటికే ఆయన కోసం ముగ్గురు నలుగురు అమాయక పక్షులు ఎదురు చూస్తూ కూర్చోవడంతో హమ్మయ్య ఈ వేళ మన కలక్షను ఫుల్ అని మనసులోనే సంతోషిస్తూ, తనదైన స్టైల్‌లో మొదటి వ్యక్తిని "ఆ! ఏమిటి నీ పని?" అడిగేడు రొటీన్‌గా.

అతడు "సార్! నా ఫైలు మీ టేబుల్ మీదకు వచ్చి రెండు నెలలైంది! మీరు కొంచెం చూసి ఆఫీసరుగారికి పంపిస్తే.." నసిగేడు ఆ వ్యక్తి.

"రెండు నెలలకే రెండు సంవత్సరాలైనట్లుగా వర్రీ అయిపోతున్నావే? ఇంత కంగారైతే ఎలానయ్యా?" పరిహాసంగా నవ్వేడు రామారావు.

"మీరు ప్లాను అప్రూవల్ ఇస్తేనే కదయ్యా నేను ఇల్లు కట్టుకోవడం మొదలుపెట్టేది! మళ్లీ మంచి రోజులు వెళ్లిపోతున్నాయి కదండీ!" చెప్పేడా వ్యక్తి.

"ఓహో! అందుకా ఈ కంగారంతా?" అని ఆ వ్యక్తిని దగ్గరగా రమ్మని అతడి చెవిలో "ఒక ఫైవు కొట్టించు! ఫైలు వెంటనే కదులుతుంది!" నసిగేడు రామారావు.

అంతే! తరువాత జరిగిన హఠాత్పరిణామానికి ఆశ్చర్యపోయేడు రామారావు.

"ఎందుకండీ? ఎందుకు మీకైదొందలు కొట్టించాలి? ప్రభుత్వం మీకు వేలకి వేలు జీతాలిస్తోంది కదా?" బిగ్గరగా అరిచేడు ఆ వ్యక్తి. అప్పుడు కానీ రామారావుకి సదరు వ్యక్తి నెల రోజుల క్రిందట తనెక్కిన సిటీ బస్సు కండక్టరు రాజు అని గుర్తుకు రాలేదు. తన జ్ఞాపకశక్తిని తనే నిందించుకున్నాడు. ఆఫీసులో అందరూ తన కేసే చూస్తున్నారు. రాజు ఇంకా రెచ్చిపోతున్నాడు. "ఆ రోజు సిటీ బస్సులో నిజంగానే చిల్లర లేక ఆఫ్టాల్ అర్థ రూపాయి ఇవ్వకపోతే ఎంత రాద్ధాంతం చేసేవు? ఇలా అర్థరూపాయిలు మిగుల్చుకునే మీ కండక్టర్లందరూ మేడలు కడుతున్నారన్నావు! నువ్విలాంటి అయిదొందలతో ఎన్ని మేడలు కట్టేవు? నేను రోజంతా కష్టపడి నీ జీతంలో నాలుగో వంతు తీసుకుంటున్నాను. కానీ, నువ్వు ఈవేళ చేసిందేమిటి? మీకూ జీతాలు ఇస్తోంది కదా ఈ ప్రభుత్వం?" గట్టిగా బల్లగుద్ది మరీ అడిగేడు రాజు ఇప్పుడు.

రామారావుకి ఆ రోజు బస్సులో జరిగిన సంఘటన బాగా జ్ఞప్తికి వచ్చింది. ఓరినీ దెబ్బకు దెబ్బ ఎలా తీసేవురా! అందరి ముందు తలకొట్టేసినంత పనయింది. అవమానంతో తలదించుకున్నాడు రామారావు! చేసేదేమీ లేక.

**-బులుసు రాధాకృష్ణమూర్తి★**

# పోస్టుమేన్

రచయితలకు, కవులకు పోస్టుమేన్ అంటే ప్రత్యేకమైన అభిమానం ఉందని అనిపిస్తుంది. తమ రచనల్ని ప్రచురణకై పత్రికలకు తీసుకెళ్లడం మరలా కాంప్లిమెంటరీ కాపీలను, పారితోషికాన్ని తెచ్చివ్వడం ఈ అభిమానానికి కారణమేమో.

నేను పోస్టుమేన్‌పై రాసిన కవితలు తక్కువేం కాదు. ఎన్నో కవితలు పత్రికల్లో ప్రచురింపబడ్డాయి కూడా.

ఇప్పటి వరకూ ఎందరో ప్రముఖ కవులు పోస్ట్‌మేన్‌పై కవితలు రాసేరే తప్ప, పూర్తి కవితాసంకలనం ఎవరూ ప్రచురించలేదు. నా కవితా సంకలనం ప్రచురింపబడితే, పోస్టుమేన్‌పై ప్రప్రథమ కవితా సంకలనం ప్రచురించిన ఘనత నాకే దక్కుతుంది.

ఆలోచన రావడమే తడవు కవితా సంకలన ప్రచురణకై ప్రయత్నాలు ప్రారంభించాను. ఎంతోమంది పబ్లిషర్స్‌ని కలిసినా, వివిధ కారణాల వల్ల నా ప్రయత్నాలు సఫలీకృతం కాలేదు. ఆ సమయంలో అనుకోని అవకాశం పోటీ రూపంలో లభించింది. హైదరాబాద్ నగరంలో ఇటీవలె స్థాపించబడిన సాహితీ సాంస్కృతిక సంస్థ 'సృజన' ఒక పోటీ నిర్వహిస్తోంది.

కవులు తమ అముద్రిత కవితా సంకలనాల్ని పోటీకి పంపవచ్చు. పోటీకి వచ్చిన సంకలనాల్లో ఉత్తమమైన ఐదింటిని ఎంపిక చేసి, హైదరాబాద్‌లో జరిగే సభలో బహుమతి ప్రదానం చేస్తారు. బహుమతిగా ఒక మెమంటో, ఐదువేల రూపాయల కేష్ ఇస్తారు. తరువాత ఆ సంకలనాల్ని తమ ఖర్చుతో పుస్తక రూపంలో ప్రచురిస్తారు. అయితే, ఆ సభకి స్వయంగా హాజరై కవులు తమ బహుమతిని గ్రహించాలి. లేకపోతే, అవార్డ్ రద్దవుతుంది.

మర్నాడే నా కవితా సంకలనాన్ని పోటీ నిర్వాహకులకి పంపించివేశాను. పోటీలో గెలుపొందిన వారికి నిర్వాహకులు పోస్ట్ ద్వారా తెలియజేస్తారు. కనుక ఉత్తరం కోసం ఆతృతగా ఎదురుచూస్తూ ఉన్నాను. నన్నే గనుక అంతటి అదృష్టం వరిస్తే, ఈ కవితలు నేను రాయడానికి స్ఫూర్తి అయిన మా పోస్టుమేన్‌కి ఏదైనా ఖరీదైన బహుమతి ఇవ్వాలని నిశ్చయించుకున్నాను.

అందుకే ప్రతీ యేటా ఆనవాయితీగా ఇస్తూ వస్తున్న ఇరవై రూపాయల దసరా మామూలు ఇవ్వకుండా, నెల తరువాత చూద్దామని వాయిదా వేశాను.

ఆశగా పోస్టుమేన్ కోసం ఎదురుచూస్తూ ముందు గదిలో కూర్చున్నాను. ఉత్తరాలు బట్వాడా చేసుకొస్తున్న పోస్టుమేన్ మా ఇంటిముందు ఆగకుండా వెళ్లిపోయాడు.మర్నాడు ఉత్తరం వస్తుందేమోనన్న ఆశతో వీధి బైటే నిల్చుండిపోయాను. ఉత్తరాలు ఇచ్చుకుంటూ వస్తున్న పోస్ట్‌మేన్, మా ఇంటి ముందు సైకిలు దిగకుండా తిన్నగా వెళ్లిపోయాడు.

అయినా నా ఆశగానీ, ఈ ప్రపంచంలో పోస్టుమేన్ మీద కవితలకు ఎవరు ప్రాధాన్యం ఇస్తారు? పొద్దస్తమానం ఎండలో సైకిలుపై తిరిగే చిరుజీతగాడు. బాధతో కూర్చొని పోస్ట్‌మేన్‌పై మరి రెండు కవితలు రాశాను.

మర్నాడు ఉదయం ముందు గదిలో పేపరు తిరగేస్తూ కూర్చొని ఉన్నాను. పది గంటల ప్రాంతంలో పోస్ట్‌మేన్ మా ఇంటి ముందు ఆగి, ఒక ఉత్తరం ఇంట్లోకి గిరాటేశాడు. "ఏంటి సారూ! దసరా మామూలు నెల తరువాత ఇస్తారా? మీ ఉత్తరాలు ఓ నాలుగు రోజులు లేటు చేస్తే మీకెలాగుంటుందో తెలియజెయ్యాలని దీన్ని ఓ నాలుగు రోజులు లేటుగా ఇస్తున్నా, మీరు పంపిన ఏ పనికిమాలిన కవితో తిరిగొచ్చుంటుంది" అంటూ వెళ్లిపోయాడు.

వణుకుతున్న చేతులతో కవరు చింపి చూశాను. "మీరు పంపిన పోస్టుమేన్ కవితా సంపుటి పోటీలో ఎంపికయిందని, అవార్డు అందుకునేందుకు స్వయంగా సభకు హాజరు కావాల్సిందని 'సృజన' కార్యనిర్వాహక వర్గం పంపిన ఆహ్వాన పత్రిక అది." దాంతో పాటు "ఇంత చక్కని కవితలు రాయడానికి స్ఫూర్తినిచ్చిన మీ పోస్టుమేన్‌ని కూడా తీసుకొని రమ్మని, అతనిని కూడా ఘనంగా సన్మానిస్తామని," ఉత్తరం జత చేశారు.

దురదృష్టం నాదా, పోస్టుమేన్‌దా అర్థం కాలేదు.

**-బి.హెచ్.వి.నాగేశ్వరరావు (రాయగడ)★**